**కథ**

ఊరి మధ్యనున్న ఆ రంగుల భవంతి ప్రసాదరావుగారిది. సువిశాలమైన ఆ భవంతి చుట్టూ ప్రహరీ, రకరకాల మొక్కలు, పక్షులు, సుతారంగా వీచే గాలి మొత్తంగా చెప్పాలంటే ఆహ్లాదకరంగా వుంటుంది.

''దండాలయ్యగోరూ'' అన్న మాటతో పేపర్ చూస్తున్న ప్రసాదరావుగారు తలెత్తి చూశారు.

# యద్భావం తద్భవతి

''రారా! వేంకటేశం. అంతా బావున్నారా! ఏంటి విశేషాలు?'' ఆప్యాయంగా పలుకరించారాయన.

''బావున్నామయ్యా..కానీ..'' నసిగాడు వేంకటేశం.

''ఏంట్రా..ఏంటి సంగతి? అలా తొట్రుపడతావేం?''

''సుబ్బులుకు..అదేనయ్యా నా పెళ్ళానికి నెల రోజుల నుండి కడుపు నొప్పి వస్తూంది. ఈమధ్య తీవ్రంగా నొప్పి వస్తే గాయత్రిగారి ఆస్పత్రికె ళ్ళాము. ఆపరేషన్ చేయాలన్నారు. నాలుగు వేలు ఖర్చవుతుందట. కానీ..'' చెబుతున్నాడు వేంకటేశం.

తర్వాతి మాటలేవీ వినలేదాయన. వెంటనే ఫోన్ అందుకున్నాడు.

ఆపరేషన్ చేసి బిల్ తనకు పంపమని డాక్టర్‌గార్కి చెప్పారు. లెటర్ ప్యాడ్ తీసుకుని విషయం వ్రాసి, సైన్ చేసి వేంకటేశం చేతికిచ్చి ''ఈ కాగితం తీసుకెళ్ళి గాయత్రిగారికి చూపించు. అన్నీ వాళ్ళే చూసుకుంటారు'' అన్నారాయన.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా నమస్కరించి వెళ్ళిపోయాడు వేంకటేశం.

చలమయ్య తండ్రి అంత్యక్రియలకు డబ్బడిగితే ఇచ్చి పంపాడు.

రామనాథం కూతురు పెళ్ళికి సరుకులు, అవసరమైన సరంజామా పంపమని అడగగానే షాప్‌వారికి ఆర్డర్ జారీ చేశాడు.

ఆ గ్రామానికి చుట్టుప్రక్కల పది ఊర్లకు ప్రసాదరావుగారు తెలుసు. ఆయన భార్య జానకమ్మంటే తెలుసు.

ప్రసాదరావుగారికి పొలము ఆస్తిపాస్తులున్నాయి.

> ''బాగా బ్రతికి వున్నన్ని దినాలు ఆయన చుట్టూ తిరిగారు. సాయం పొందారు. రేపో మాపో చావబోయే వాడితో మాకేంటి పనుందని ఒక్కరూ రాలేదు. అంతా ముఖం చాటేశారు. ఈ మనుష్యులు ఎంత స్వార్థపరులు?'' అంటూ బాధతో కళ్ళలో నీళ్ళు గ్రుక్కుకునేది జానకమ్మ.

ఎప్పుడూ తెల్లటి వస్త్రాలతో, కళ్ళజోడు, చేతిలో పొన్ను కర్ర, భుజంపై [illegible], హుందాగా, ప్రశాంతంగా వుండేవారాయన. పెదవులపై ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో వుండేవారు.

అయిన వాళ్ళంటే ప్రేమిస్తారు. నిస్వార్థంగా అవసరమైనవారికి సాయపడతారు. ఆయన కష్టాల్లో వున్నవారికి కొండంత అండ.

[illegible] నలుగురికీ [illegible] వుంది అంటారాయన. ఎన్నో పెళ్ళిళ్ళు ఆయన చేతుల మీదుగా జరిగాయి. అనాథల అంత్యక్రియలు దగ్గరుండి తనే జరిపించారు. ఎముకలేని చేయి ఆయనది. ప్రతి ఏడూ పేదలకు వస్త్రదానం చేస్తారు. తెలివితేటలుండీ ఆర్థిక సహాయం లేక అల్లాడే అభాగ్యులకు సాయం చేసారు. ఆయన సాయంతో చదివిన వాళ్ళలో నేడు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, పోలీస్ కమీషనర్ లాంటి పెద్ద పెద్ద హోదాల్లో వున్నారు.

ప్రసాదరావుగారి ఏకైక సంతానం విశ్వనాథం.

అతను హైదరాబాద్‌లో ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్. తండ్రి దానధర్మాలకు కొడుకెప్పుడూ అడ్డురాలేదు.

అలాంటి పుణ్యాత్ముని విషయంలో అనుకోకుండా జరిగిందా సంఘటన.

ఓసారి పొరుగూరిలో ఉత్సవానికెళ్ళి వస్తుండగా దారిలో కారు ఆగిపోయింది. డ్రైవర్ క్రిందకు దిగి రిపేర్ చూడసాగాడు. ప్రసాదరావుగారు క్రిందకు దిగి చెట్లను, కొండలను చూస్తూండిపోయారు. డ్రైవర్ విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కారు కదలనని మొరాయిస్తోంది. ఆ దారిన వాహనాలేవీ రాలేదు.

ప్రసాదరావుగారికి విపరీతమైన దాహం వేసింది. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. వెంట వాటర్ బాటిల్ లేదు. చుట్టుప్రక్కల నీళ్ళు దొరుకుతాయేమోనని చూశారు. ఓ చోట చిన్న గుంటలో నీళ్ళు కనిపించాయి. ఆ నీళ్ళు దోసిట ముఖంపై జల్లుకుని, దాహం తీర్చుకున్నాడు. చిన్నప్పుడు పొలం గట్ల వెంట కాలువల్లో దాహం తీర్చుకోవటం గుర్తొచ్చింది. తర్వాత కారు కదలటం, ఇల్లు చేరటం జరిగింది.

వారం రోజుల తర్వాత ప్రసాదరావుగారికి చర్మంపై బొబ్బలు వచ్చాయి. పుండ్లుగా మారాయి. చర్మంపై సూదిమోపను స్థలం లేకుండా పుండ్లు విస్తరించాయి.

అది చూసి జానకమ్మగారు కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. విశ్వనాథంగారికి ఫోన్ చేశారు. ఆఘమేఘాల మీద వచ్చాడు విశ్వనాథం. తన వెంట ప్రముఖ స్కిన్ స్పెషలిస్టులను తీసుకువచ్చాడు.

తాను గుంటలో నీళ్ళు తాగిన విషయం తర్వాత ఈ జబ్బు రావటం గురించి చెప్పారు ప్రసాదరావుగారు. డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో అన్ని టెస్టులూ చేసి ముఖం వ్రేలాడేశారు.

''ఏమయ్యా అలా అయిపోయారు? ఈ జబ్బు నయం కావటానికి ఎన్నాళ్ళు పడుతుంది?'' కళ్ళలో నీళ్ళు గ్రుక్కుకుంది జానకమ్మ.

''ఏంటి వంశీ..అలా మౌనంగా వున్నారు?'' గొంతు కంపిస్తుండగా అడిగాడు విశ్వనాథం.

''మిస్టర్ విశ్వనాథం..ఇది చాలా భయంకరమైన అంటువ్యాధి. ఈ వ్యాధి వున్న జంతువేదో ఆ నీళ్ళు త్రాగి వుంటుంది. ఆ నీరు మీ ఫాదర్ త్రాగటం వలన వైరస్ ఆయనలోకి ప్రవేశించాయి. ఈ వైరస్ శరీరంలో ప్రవేశించిన పదిరోజుల్లోనే పుంజుకుని వ్యాధి తీవ్ర రూపం దాల్చుతుంది. చర్మంపై పుండ్లు తయారై చర్మాన్ని, రక్తనాళాల్ని కొరికేస్తాయి. రక్తంలో తెల్ల రక్తకణాల్ని నిర్వీర్యం చేస్తాయి. వ్యాధి నిరోధక శక్తి నశించిపోతుంది. ఈ వ్యాధి ఒకరి నుండి ఒకరికి చాలా సులభంగా వ్యాపిస్తుంది. పూర్తిగా ఈ జబ్బును నయం చేసే మందు ఇప్పటిదాకా కనుక్కోలేదు'' చెబుతున్నాడు డాక్టర్ వంశీ.

శత శతఘ్నులు ఒక్కసారే పేలినట్లు అదిరిపడ్డాడు విశ్వనాథం.

అతని కంటి కొసల్లో చిప్పిల్లిన నీటి బొట్లు స్పష్టంగా అగుపిస్తున్నాయి. ఏడుస్తున్నాడతను. జానకమ్మగారి పరిస్థితి చెప్పనలవికాలేదు. నోటికి చెంగడ్డం పెట్టుకుని రోదిస్తూంది.

ప్రసాదరావుగారు వెంటనే డ్రైవర్‌ను పిలిచి ఆ నీటి గుంటను పూడ్చి రమ్మని పంపారు. అంతటి భయంకర పరిస్థితి మధ్య కూడా ఆయన పరోపకార గుణానికి డాక్టర్లు విస్మయం చెందారు. గుంటను పూడ్చి రమ్మనాలన్న ఆలోచన తమకు రానందుకు సిగ్గుపడ్డారు.

డాక్టర్ వంశీ జానకమ్మగారిని పక్కకు పిలిచి ''అమ్మా..మేము ఈ జబ్బు విషయంలో ఏ సాయం చేయలేకపోతున్నందుకు క్షమించండి. ఈ జబ్బు ఎవరికోగానీ రాదు. వచ్చినవారు చాలా కాలం బ్రతకరు. తాత్కాలికంగా బాధ తగ్గించే మందులు వ్రాసిస్తాను. ఆయనకిష్టమైన వంటలు చేసి అందించండి..'' అన్నాడు రుద్ధమైన గొంతుతో.

ఇంతకంటే చెప్పేదేమీ లేదన్నట్లు తలొంచుకున్నాడు.

జానకమ్మగారు గుండెలు బాదుకుని ఏడ్చారు. ఆ భవంతిలో ఒక ప్రత్యేకమైన గదిని ఆయన కోసం అన్ని వసతులతో ఏర్పాటు చేశారు. విశ్వనాథం అక్కడుండీ చేయగలిగిందేమీ లేకపోవటంతో బాధను మనసులో నిక్షిప్తం చేసుకుని హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

ప్రసాదరావుగారి జబ్బు గురించి చుట్టుప్రక్కల గ్రామాలకు డ్రైవర్ ద్వారా పొగలా వ్యాపించింది. మిత్రులు, బంధువులు, ఆయన సాయం పొందిన

వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఆయన్ను చూడటానికి రాలేదు.

''బాగా బ్రతికి వున్నన్ని దినాలు ఆయన చుట్టూ తిరిగారు. సాయం పొందారు. రేపో మాపో చావబోయే వాడితో మాకేంటి పనుంది అని ఒక్కరూ రాలేదు. అంతా ముఖం చాటేశారు. ఈ మనుష్యులు ఎంత స్వార్థపరులు?'' అంటూ బాధతో కళ్ళలో నీళ్ళు గ్రుక్కుకునేది జానకమ్మ.

తాత్కాలిక ఉపశమనం కోసం ఇచ్చిన మందులు వాడుతూ, జానకమ్మగారు తెచ్చి ఇచ్చిన భోజనం చేస్తూ ఒంటరిగా మృత్యువు కోసం ఎదురుచూస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు ప్రసాదరావుగారు.



ఆయన్ను చూసి జానకమ్మగారికి విధి మీద వెర్రి కోపం వచ్చేది. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూనే వుంది. ఒక్కరంటే ఒక్కరు కూడా ఓదార్చను ఆ భవనం వైపు రాలేదు.

మౌన ముద్ర దాల్చిన మహర్షిలా వున్నారు ప్రసాదరావుగారు.

రెండు వారాల తర్వాత విశ్వనాథం వచ్చాడు. తన వెంట శరభయ్య అనే ఆయుర్వేద వైద్యుడిని తీసుకొచ్చాడు.

''అమ్మా..ఈయన శరభయ్య అని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు. నేను వెళ్ళగానే ఈయన్ను కలిశాను. వ్యాధి లక్షణాలు చెప్పాను. సైన్సుకు సాధ్యంకాని ఈ జబ్బును తన మందులతో తగ్గిస్తానంటే తీసుకువచ్చాను. అవసరమైన మూలికలు సమకూర్చుకుని వచ్చేసరికి లేటయింది'' జానకమ్మగారితో చెప్పాడు విశ్వనాథం.

ఎడారిలో ఒయాసిస్సును చూసినట్లు ఆమె మనసు కొంచెం కుదుటపడింది. డాక్టర్ శరభయ్య రావుగారిని చూశాడు. మందు గుళికలు, లేపనాలు తయారుచేసి ఇచ్చాడు. వాటిని వాడే విధం, పథ్యం చెప్పి నెలరోజుల్లో వ్యాధి తగ్గుముఖం పడుతుందని భరోసా ఇచ్చాడు.

జానకమ్మగారు కన్నీళ్ళతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శరభయ్య, విశ్వనాథం వెళ్ళిపోయారు. ప్రసాదరావుగారు శరభయ్య చెప్పిన ప్రకారం మందులు వాడుతున్నారు. వ్యాధిక్రమంగా తగ్గుముఖం పట్టింది. మధ్యలో విశ్వనాథం, శరభయ్య రెండుసార్లు వచ్చి వెళ్ళారు.

కాలచక్రంలో ఆరుమాసాలు దొర్లిపోయాయి. పుండ్లు మాయమయ్యాయి. ప్రసాదరావుగారి జబ్బు పూర్తిగా నయమైంది. ఈలోగా ఒక్కరూ ఆయన్ను పలకరించడానికి రాలేదు.

ప్రసాదరావుగారు బాగా కోలుకుని, మామూలు మనిషయ్యాడనే వార్త ఊరంతా గుప్పుమంది. జనం తండోపతండాలుగా ఆయన్ను చూడటానికి రాసాగారు. ప్రసాదరావుగారు అందరినీ సాదరంగా ఆహ్వానించి, వారి క్షేమసమాచారాలడిగి చిరునవ్వుతో పంపిస్తున్నారు. చుట్టు ప్రక్కల నుండి స్కూటర్లు, కార్లలో వచ్చి ఆయన్ను పరామర్శించి వెళ్తున్నారు. ఆయన భవంతి ఓ దేవాలయంలా మారిపోయింది.

ప్రసాదరావుగారు ఎప్పటిలానే అందరి అవసరాలు, ఇబ్బందులను గుర్తించి తగిన సాయం చేయటం మొదలెట్టారు. ఆయనలో ఇసుమంత కూడా మార్పురాలేదు.

జానకమ్మగారు ఆయనతో ''చూశారా! వీళ్ళ స్వార్థం. అందరూ మీ నుండి ఎంతో కొంత సాయం పొందినోళ్ళే. మీరు ఎంతోకాలం బ్రతకరని తెల్సి, పోయే వాడితో మనకేంటి పనని ఒక్కరూ వచ్చి మిమ్మల్ని పలకరించిన పాపాన పోలేదు. మీరు కోలుకుని బాగున్నారని తెలియగానే ఇప్పుడు బెల్లం చుట్టూ ఈగల్లా మూగుతున్నారు. ఇప్పటికైనా ఈ మనుష్యుల స్వార్థాన్ని గుర్తించండి. ఇక ముందు ఏ ఒక్కరికీ పూచిక పుల్ల కూడా సాయం చెయ్యొద్దు'' అన్నారు ఈసడింపుగా.

ఆయన చిరునవ్వు నవ్వి ''జానకీ, అందరూ వచ్చి నన్ను పరామర్శించి వెళ్ళాలని నేనెప్పుడూ కోరుకోలేదు. ఎవ్వరూ నా వద్దకు రాకుండా చూడమని భగవంతుని రోజూ కోరేవాడ్ని. ఇది భయంకరమైన అంటువ్యాధి. నాతో మాట్లాడితే ఈ వ్యాధి ఎక్కడ అంటుకుంటుందోనని వాళ్ళు ప్రాణభయంతో భయపడిపోయారు. వాళ్ళు రాకపోవటానికి కారణం నా మీద అభిమానం లేక కాదు. నాడు భయంతో రాలేదు. నేడు ప్రేమతో వస్తున్నారు. వారిని నీవు అపార్థం చేసుకున్నావు. నేను చేసిన సత్కార్యాలే శరభయ్య రూపంలో వచ్చి నన్ను కాపాడాయి'' అన్నారు. ఆయన ఔన్నత్యం, ఔదార్యం, నిస్వార్థ విశ్వప్రేమ, ధర్మగుణానికి ఆమె చలించిపోయారు.

ఆయన మాటలకు జానకమ్మగారు విస్మయం చెందారు.

''నేను ఎందుకు ఆయనలా ఆలోచించలేకపోయాను. అందరిపై ద్వేషాన్ని పెంచుకున్నాను. మంచయినా, చెడయినా మనం చూసే చూపులో వుంది. మంచివాడికి లోకమంతా మంచే దర్శనమిస్తుంది. భగవంతుడా! దేశాన్ని దోచుకునే స్వార్థపరుల గుండెల్లో ఆయనకున్న మానవత్వాన్ని, ధర్మగుణాన్ని పిసరంతయినా ప్రవేశపెట్టు. ఈ దేశం బాగుపడుతుంది.'' మనసులో అనుకుంటూ వుండిపోయారు జానకమ్మగారు.

★

**డి.కె.చదువులబాబు**